క్లుప్తంగా

హైదరాబాద్‌కు డీఎస్సీ విజేతలు



సిరిసిల్లలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: డీఎస్సీ విజేతలు హైదరాబాద్‌లో ఉపాధ్యాయులుగా నియామకపత్రాలు అందుకునేందుకు బుధవారం సిరిసిల్ల నుంచి తరలివెళ్లారు. మూడు బస్సుల్లో 130 మంది వెళ్లిన వాహనాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, భాషా పండితులు, పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు మొత్తం కలిపి 130 మంది అర్హత సాధించారని వివరించారు. వీరికి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేస్తారని తెలిపారు. డీఈవో రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



సిరిసిల్లటౌన్: కార్మికులకు కిట్లు అందిస్తున్న చైర్‌పర్సన్ కళ, కమిషనర్ అలీబేగ్

సిరిసిల్లటౌన్: పారిశుధ్య కార్మికుల సేవలు గొప్పవని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం కార్యాలయంలో శానిటేషన్ కార్మికులకు నూతన వస్త్రాలు, శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు కల్లూరి రాజు, దార్నం అరుణ, అన్నారం శ్రీనివాస్, పత్తిపాక పద్మ, గుండ్లపెల్లి నీరజ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్‌గౌడ్ దుస్తులు పంపిణీ చేశారు. స్పెషల్ అధికారి రవీందర్, పంచాయతీ కార్యదర్శి ఎండీ.సమీర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలోని పారిశుధ్య కార్మికులకు మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్ దంపతులు దుస్తులు అందజేశారు.

ఇల్లంతకుంట : ఇల్లంతకుంటలోని జీపీ కార్మికులకు యువజన సంఘాల అధ్యక్షుడు ఉప్పల అమరేందర్ దుస్తులు పంపిణీ చేశారు. గొడుగు నరసయ్య ఏగుర్ల దత్తు దేవయ్య హరికిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ


వేములవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు విద్యతో పాటు ఆత్మరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి రక్షా ప్రశిక్షణ్ పథకం కింద కరాటే శిక్షణ కూడా అందించనున్నది. ప్రతి మూడు నెలలకోసారి ప్రత్యేక కరాటే శిక్షణను మాస్టర్‌తో విద్యార్థులకు ప్రత్యేకంగా నేర్పించేందుకు జిల్లా యువజన క్రీడల శాఖ ఉత్తర్వులు కూడా జారీచేసింది. ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వం గురుకులాల్లో చదివే విద్యార్థినులకు ప్రత్యేకంగా ఈ శిక్షణ అందించాలని నిర్ణయించడంతో జిల్లాలోని 139 గురుకుల, ప్రభుత్వ పాఠశాలల కు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షంవ్యక్తంచేస్తున్నారు.

డిపాజిట్ బాండ్ అందజేత



రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన గుగ్గిళ్ల శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. 2004–2005లో శ్రీనివాస్‌తో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అతని కూతురు పేరుపై సుకన్య సమృద్ధి యోజన పథకంలో రూ.34,200 డిపాజిట్ చేశారు. పోస్టల్ డిపాజిట్ బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. జనసేన ఫౌండేషన్ అధ్యక్షుడు బడుగు అరుణ్, ప్రధాన కార్యదర్శి పల్లికొండ శ్రీకాంత్, కోశాధికారి సామ ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కరుణాకర్, కార్యదర్శి పెద్దవేని హైదర్ యాదవ్ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం



బహుమతులు అందిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో వారం రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన సుప్రీం టీమ్‌కు మాజీ ఎంపీటీసీ దేవరకొండ నర్సింహాచారి, బీజేవైఎం మిర్యాల్‌కార్ బాలాజీ, పల్లె రవీందర్ రెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



తొమ్మిది రోజులు పూల పండుగ



ముస్తాబాద్: తొమ్మిది రోజులు తెలంగాణ పల్లెలు పూలజాతరను తలపిస్తాయి. ప్రపంచంలో ఎక్కడ పూలను పూలతో పూజించే సంప్రదాయం లేదు. తెలంగాణలోనే పూలతో బతుకమ్మలు పేర్చి భక్తితో పూజించే సంప్రదాయం ఉంది. వివిధ రకాల పూలను సేకరించి ప్రతిరోజు గౌరీదేవిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేస్తాం. వాడకట్టు మహిళలంతా ఒక్కచోట చేరి సంబరంగా బతుకమ్మ ఆడుతాం. – కుంభాల మంగ, ముస్తాబాద్

ఆడబిడ్డలకు బతుకమ్మ ప్రత్యేకం



తంగళ్లపల్లి: తెలంగాణ ఆడబిడ్డలకే బతుకమ్మ పండుగ ప్రత్యేకం. పండుగను తొమ్మిది రోజులపాటు జరుపుకోవడంలో ఎంతో అనుభూతి కలుగుతుంది. మా ఇంటి బతుకమ్మ ప్రత్యేకంగా కనిపించేలా తీరొక్క పూలతో బతుకమ్మను పేరుస్తాం. బతుకమ్మ తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక – వెంగల లావణ్య, తంగళ్లపల్లి

తీరొక్క పూలతో పేరుస్తాం



చందుర్తి: బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచులకు ప్రత్యేకమైన పండుగ. అడవిలో సహజ సిద్ధంగా లభించే పూలను తీసుకొచ్చి అందంగా పేర్చుతాం. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడుకుంటాం. పండుగకు ఎక్కడెక్కడో ఉన్న వారంతా కలుసుకుంటారు. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆ సంబురమే వేరు. – దర్శనాల రోషిని, బండపల్లి

జోరుగా పూల వ్యాపారం







సద్దుల బతుకమ్మకు ఒకరోజు ముందే సిరిసిల్లలో పండుగ శోభ కనిపించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సిరిసిల్ల రోడ్లన్నీ పూలవనంగా మారాయి. గాంధీచౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు, మార్కెట్, పాతబస్టాండు, పెద్దబజార్, కొత్తబస్టాండ్, గోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ పూల విక్రయాలు కొనసాగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు, గిరిజనులు విరిపూలను పెద్దఎత్తున తీసుకొచ్చి విక్రయాలు జరిపారు. రోడ్లపై విక్రయాలు సాగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. గునుగుపువ్వు (మూడుకట్టలు) రూ.20, తంగేడు (మూడు కట్టలు) రూ.50, అడవి చామంతి (మూడుకట్టలు) రూ.50, పట్టుకుచ్చులు (మూడుకట్టలు) రూ.30 చొప్పున అమ్మకాలు జరిగాయి. బతుకమ్మకు కావాల్సిన అన్నిపూలు తక్కువగా పూయడంతో డిమాండ్ పెరిగింది. పట్టణంలో రాత్రి 10 గంటల వరకు వ్యాపారులు పూలను విక్రయించారు.

– సిరిసిల్ల టౌన్

స్వగ్రామంలో చొప్పదండి ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట గ్రామానికి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీ వియోగం తర్వాత తొలిసారిగా స్వగ్రామానికి రాగా.. పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే సత్యం భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆమె మరణానంతరం స్వగ్రామానికి చేరుకోగా స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

సిరిసిల్ల కల్చరల్: జిల్లాలో అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రదేశ్ లీగల్ హ్యూమన్ రైట్స్ శాఖ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండించారు. అనంతరం ఆయనను న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బుర్ర రవితేజ గౌడ్ జిల్లా లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ కొండాపురం వెంకట్ రెడ్డి, లీగల్ డిపార్ట్‌మెంట్ జిల్లా నాయకులు కల్యాణ చక్రవర్తి, గుర్రం ఆంజనేయులు, ధర్మేందర్, గోవర్దన్ రెడ్డి, పసుల కృష్ణ, చొటపెల్లి వేణుగోపాల్, దేవరాజు బిగ్గుళ్ల బాబు శేఖర్, బొడ్డు ప్రశాంత్ బుర్ర వివేక్ గౌడ్ గొడిసెల భగవాన్, కడగండ్ల తిరుపతి, అనిల్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

పథకాలపై కళాజాత

కోనరావుపేట: మండలకేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు గురించి వివరించారు. పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గద్దం దేవయ్య, పూడూరి సంజీవ్, అంతడ్పుల ఝాన్సీ, లావణ్య, కిన్నెర, శ్రీలత, అనుముల శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో బుధవారం పరిసరాల పరిశుభ్రత, సంక్షేమ పథకాలు, డ్రగ్స్, గంజాయి నిషేధంపై కళాకారులు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు రుణమాఫీ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాకారులు శ్రీరాముల రామచంద్రం, శ్రీనివాస్, పర్శరాములు, గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి



వీర్నపల్లిలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘురాం



ఇల్లంతకుంటలో బతుకమ్మ తెప్పె వద్ద చదును చేసిన స్థలం

ముస్తాబాద్: మండలకేంద్రంలో సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమేశ్ తెలిపారు. పారిశుధ్య చర్యలు చేపట్టామన్నారు. శివకేశవ ఆలయ ప్రాంగణంలో బతుకమ్మకు ఏర్పాట్లు చేశామన్నారు. ముస్తాబాద్ పెద్ద చెరువులో బతుకమ్మల నిమజ్జనానికి లైట్లు, తోరణాలు, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో సద్దుల బతుకమ్మకు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలను అమర్చి బతుకమ్మ తెప్పలను నీటితో నింపారు.

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో రాఘురాం, తహసీల్దార్ మారుతి రెడ్డి తెలిపారు. వీర్నపల్లి చెరువు, రంగంపేట జంపన్న చెరువుల వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించారు. గ్రామాల నుంచి చెరువుల వరకు వీధుల్లో ప్రత్యేకంగా ఎల్ఈడీ లైట్లను అమర్చినట్లు పేర్కొన్నారు. చెరువు గట్టున స్థలాన్ని చదును చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.



చందుర్తి : రామన్నపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బోయినపల్లి: తడగొండలో..

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

సిరిసిల్ల టౌన్/ చందుర్తి/ఇల్లంతకుంట/ ముస్తాబాద్/ కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/రుద్రంగి: దేవీ శరన్నవరాత్రోత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం అమ్మవారు సరస్వతి రూపంలో భక్తులకు దర్శన మిచ్చారు. మండపాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందుర్తి మండలం రామన్నపేటలో, రుద్రంగి మండలకేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. పలుచోట్ల నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రతిభా పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న వెల్దండి హరిణి

వేములవాడ: విద్యార్థులను చదువులో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పదో తరగతి, ఇంటర్, ఎంసెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని సత్కరిస్తూ పద్మశాలీ సేవా సంఘం, రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెమెంటోలు అందజేశారు. జిల్లాకు చెందిన వెల్దండి హరిణి ఇంటర్ ఫలితాల్లో 472 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబర్చి పద్మశాలీ ప్రతిభా పురస్కారం అందుకుంది. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిప్ప రాజేశం, ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల లక్ష్మీనర్సయ్య, కోశాధికారి కొండా సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



వేములవాడరూరల్: సిరిసిల్లకు చెందిన లారీ మానకొండూర్ మండలం ఊటూరు ఇసుక రీచ్‌నుంచి పర్మిట్‌తో ఇసుకను హైదరాబాద్‌లోని బాబుపల్లికి తీసుకెళ్లాల్సి ఉంది. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సత్తయ్య వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేటలో మహిపాల్ అనే వ్యక్తికి అధిక ధరకు విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఓనర్ పరారీలో ఉన్నట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి తెలిపారు.

23న సమావేశం



వేములవాడ: రాష్ట్ర మున్నూరుకాపులకు నిధులు సమీకరణ కోసం కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 20న హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో 33 జిల్లాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శి పొంశెట్టి శంకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు రత్నాకర్, నాయకులు పోశెట్టి, నర్సయ్యలు పాల్గొన్నారు.

నియామకం

పట్టణానికి చెందిన కూరగాయల కొమురయ్యను జిల్లా మున్నూరుకాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నియమించారు. రాజరాజేశ్వర మున్నూరు కాపు సత్రంలో కొండ దేవయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియామకపత్రం అందజేశారు. ఎన్నికైన కొమురయ్యను మున్నూరుకాపు సంఘం నాయకులు, సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

వాలీబాల్ కిట్లు అందజేత

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో క్రీడాకారులకు మాజీ వైస్‌ఎంపీపీ కచ్చకాయల ఎల్లయ్య, బాదవేణి కనక సిద్ధిరాములు వాలీబాల్ కిట్లను అందించారు. కార్యక్రమంలో దొబ్బల సంజీవ్, బొడ్డు రమేశ్, పల్లి బుచ్చిరాములు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, రవి, వెంకటేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.



చందుర్తి : మండలంలోని కొత్తపేట గ్రామానికి వెళ్లేందుకు మార్గం మధ్యలో ఉన్న ఒర్రె ప్రాంతంలో వాహనాల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలు పడితే గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. త్వరగా వంతెన నిర్మాణాన్ని చేపట్టి గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : వేంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఏఈ, చందుర్తి, సెల్‌నెం: 9866179335

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ, పోలీస్ కుటుంబాల సభ్యులు

సిరిసిల్లకల్చరల్: సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జిల్లా పోలీస్‌శాఖ బుధవారం ఘనంగా నిర్వహించింది. పోలీస్ కుటుంబాల్లోని మహిళలంతా ఒకే చోటచేరి బతుకమ్మ ఆడారు. డీసీపీ ఆవరణలో జరిగిన వేడుకలకు ఎస్పీ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీచంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు ఆర్ఐలు ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సిరిసిల్ల: పట్టణంలోని 37వ వార్డులో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కౌన్సిలర్ దిడ్డి మాధవిరాజు పంపిణీ చేశారు. మచ్చ బాలరాజుకు రూ.22,500, ఒరుగంటి రామకృష్ణకు రూ.12వేలు, కోడం రవీందర్‌కు రూ.21,000, నక్క అశోక్‌కు రూ.6వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ఎల్లారెడ్డిపేట: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ అన్నారు. రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, దుమాల గ్రామాల్లో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు పెంజర్ల బాలయ్య, జబ్బరు, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, పాశం దేవారెడ్డి, బాలయ్య, పాటి దేవయ్య, నమిలికొండ శ్రీనివాస్, సుంకరి శంకర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

● తహసీల్దార్ ఎదుట బైండోవర్

ముస్తాబాద్: ఎనిమిది మందిని ముందస్తుగా తహసీల్దార్ ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గతేడాది బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితులుగా ఉన్న వారిని ముందస్తు బైండోవర్ చేశామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.

● రాష్ట్ర కమిటీకి ఎంపిక

కోనరావుపేట: మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కమిటీకి ఎంపికైనట్లు మండల శాఖ అధ్యక్షుడు వెంగల మహేశ్, ప్రధాన కార్యదర్శి వనపర్తి వెంకటేశ్ తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా దరిపెల్లి గంగాధర్(సుద్దాల), గోషిక మధు (ఎగ్లాస్పూర్), రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పులి రాజుగౌడ్ (వట్టిమల్ల), రాష్ట్ర కార్యదర్శిగా బూరుగు శ్రీనివాస్(బావుసాయిపేట), రాష్ట్ర మహిళా కార్యదర్శిగా కొత్తూరి రమాదేవి(బావుసాయిపేట) ఎన్నికయ్యారు. వీరికి పీఆర్టీయూ టీఎస్ మండల కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

● వృద్ధాశ్రమంలో బతుకమ్మ వేడుకలు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బుధవారం బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమశాఖ సిబ్బంది వృద్ధులతో కలిసి బతుకమ్మ ఆడగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

● బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయం

బోయినపల్లి: బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం కాన్షీరాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ మండల కన్వీనర్ పెగ్గెర్ల మహేందర్, జిల్లా, అసెంబ్లీ ఇన్‌చార్జిలు అక్కి బాలకిషన్, కాంపెల్లి రాజు, సీనియర్ నాయకులు ఉన్నారు.

కోనరావుపేట: సుద్దాలలో కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు దొబ్బల స్వామి, మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

● పీఆర్టీయూ ఉపాధ్యక్షుడిగా పెరుక మల్లారెడ్డి

ఇల్లంతకుంట : మండలంలోని వల్లంపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు పనిచేస్తున్న పెరుక మల్లారెడ్డి పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో పీఆర్టీయూ స్టేట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పీఆర్టీయూ మహిళా అసోసియేటెడ్ అధ్యక్షురాలిగా అనంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దొంతుల రమాదేవిని నియమించారు. పాత్తూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోసిక మధును పీఆర్టీయూ అసోసియేటెడ్ అధ్యక్షుడిగా నియమించారు.

● గడి మైసమ్మకు షెడ్డు నిర్మాణం

ఇల్లంతకుంట : పెద్ద లింగాపూర్‌లో గుడిసెల జితేందర్ గౌడ్ గడి మైసమ్మకు రూ.50 వేలతో షెడ్డు నిర్మించారు. గతంలో దసరా పండుగ సందర్భంగా గడి మైసమ్మకు షెడ్డు నిర్మిస్తానని తెలిపారు.

● పరామర్శ

తంగళ్లపల్లి: పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. వేణుగోపాలపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లింగంపల్లి రాజు అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం పరామర్శించారు.

● హైమాస్ట్ లైట్లు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో హైమాస్ట్ లైట్లను సిరిసిల్ల ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, గడ్డం మధుకర్ (చోటు), పెద్దూరి తిరుపతి పాల్గొన్నారు.